

# ఆదివారం సాయంత్రం

ఆర్. కనకదుర్గ



అందమైన ఆదివారం సాయంత్రం మబ్బు మబ్బుగా వుండి, చల్లగా ఆహ్లాదకరంగా వుంది వాతావరణం. వారానికి వచ్చే ఒక్కరోజు శలవు దినాన్ని అయిన వాళ్లతో ఆనందంగా గడపాలని ప్రతివాళ్ళూ కోరుకుంటారు.

స్కూలు పిల్లలకయితే పండుగే! స్కూలు కెళ్లటం, టీచర్లచేత చీవాట్లు తినటం లేదుకదా వని!

కాలేజి స్టూడెంట్స్ బెంగపెట్టుకొనే రోజు కూడా అదే! శనివారం పదిగంటలకు కాలేజీనుంచి వెళ్లిపోతూ, మళ్లీ సోమవారం వరకు మీ దర్శనాలుండవు ఎలా వుండటమో అన్నట్లు దీనంగా చూస్తారు ఆడపిల్లలవైపు. కాని, ఆదివారం రోజంతా రోడ్డు మీద బీటువేసి వచ్చేపోయే వాళ్లను వెక్కిరిస్తూ, పేర్లు పెడుతూనే వుంటారు.

ఇక ఇంట్లో వుండే ఆడవాళ్లకు పని ఎక్కువగా వుండే రోజూ అదే! సాయంత్రం సరదాగా భర్తతో పిల్లలతో ఎక్కడైనా వెళ్లిరావచ్చునన్న సంతోషంతో ఎంతపనైనా చకచకా చేసుకొంటూరు.

రకరకాలైన మనుష్యులను ఎదురు బొదురుగా నడిపిస్తూ కళకళలాడుతున్న రోడ్డువైపు చూస్తూ డాబామీద నించుంది ఉమ. ఆమెకు ఆదివారం సాయంత్రమంటే ఎంతో ఇష్టం. తను బయట కెళ్ళకుండా, ఆడాబామీదనుంచొని, రకరకాలైన మనుష్యులను చూస్తూ, వాళ్ల ముఖకవళికలను బట్టి వాళ్లే పరిస్థితులలో ఇంటినుంచి బయలు దేరారో వూహించుకొంటూ, అక్కడ నిలబడట మంటే సరదా ఆమెకు. వచ్చేపోయేవాళ్ల నుంచి చెడ్డలు, అందచందాలుగురించి తనలోతాను తర్కించుకొంటూ బాగా చీకటిపడేవరకు ప్రతిసాయంత్రం అక్కడే నిల్చుంటుంది. ప్రతిరోజుకంటే ఆదివారం సాయంత్రం మాత్రం కొంచెం ముందుగావచ్చి, కాస్త ఆలశ్యంగా క్రిందికి దిగివెళ్ళిపోవటం అలవాటామెకు.

మామూలుగా ఆరోజు కూడా ఐదుగంటలయ్యే సరికి అమ్మమ్మకు చెయ్యవలసిన పనిసాయమంతా చేసేసి డాబామీదకు వెళ్లింది ఉమ. 'అక్కకూడా వుంటే ఎంత బాగుండేది?' అనుకొంది ఉమ. ఇద్దరూ కలిసి వచ్చేపోయేవాళ్లను గూర్చి చర్చించుకొనేవారు. సంవత్సరమై పెళ్లయి అత్తవారింటికి వెళ్లిపోయిన అక్కమీదకోపం వచ్చేసింది ఉమకు. అప్పుడే ఏం కొంప మునిగిపోయిందని పెళ్లి చేసేసుకోవాలి? ఎంచక్కా ఇద్దరూ కలిసి నిలబడేవాళ్ళు. ఇప్పుడు తనకు తోడెవ్వరూ లేరు. తమ్ముళ్లిద్దరూ వున్నారంటే వాళ్ల ఆటలేవాళ్లవి. వాళ్లెప్పుడూ ఇంట్లో వుండరు. పగలంతా స్కూలు, తరువాత ఆటలు. రాత్రిమాత్రం వాళ్లకీ అక్క జ్ఞాపకం వస్తుంది రాని పాటాలు చెప్పడానికి!

ఒక్కర్తే కాళ్లు నొప్పెట్టేవరకు అక్కడనుంచొని క్రిందకు వెళ్లిపోవాలి! అక్క వుంటే కాళ్లనొప్పులు తెలిసేవా కబుర్లలోపడితే! ఇలా అనుకొంటూ రోడ్డువైపు చూస్తున్న ఉమ దూరంగా రోడ్డు మొగన కిళ్లీకొట్టుదగ్గర కనబడిన శాస్త్రినిచూసి రెండడుగులు వెనక్కివేసింది. 'అమ్మో హిస్టరీ లెక్చరర్ సాంబశివం గారు! ఇక్కడ తననిలా చూస్తే ఏమనుకొంటారు? నెల్నాళ్లలో పరీక్షలు పెట్టుకొని ఈ పిల్ల ఎంత దీమాగా నుంచుందో అనుకొంటూరు. మలుపు తిరిగి పోయేవరకూ వెనక్కు వుండి మళ్లీ గోడ దగ్గరకొచ్చి నిలబడింది.

ఒక అరగంట అలా నిలబడినా, ఆదివారమైనా ఆవేళ అదేమిటో రోడ్డు ఏం సందడిగాలేదు. విసుగేసి క్రిందకు వెళ్లి ఏదైనా పుస్తకం తెచ్చుకొందామని అనుకొని, ఆఖరిసారి అన్నట్లు రోడ్డు చివరిదాకా దృష్టిసారించింది ఉమ. అటునుంచి వస్తున్న ఇద్దరు యువకులను చూడ్డంతోనే గబగబా క్రిందకు వెళ్లింది. గదిలోకెళ్లి, కుర్చీలో ఇందాక తను వడేసిన పుస్తకాలను తీసిరేక్‌లో సర్దింది. అక్కడే వున్న మంచంమీద దుప్పటి దులిపి సరిగ్గా వేసింది. ఇంతలో వాళ్లిద్దరూ వీధివరండాలో కొచ్చారు. 'ఉమాదేవీ'! అని పిల్చాడు వాళ్లలో కాస్త సన్నగా పొడుగ్గా వున్న తను. ఉమ గబగబావెళ్లి "ఓ! మీరా? రండి!" అని ఆహ్వానించింది, అతనికవెనుకనున్నతన్ని కన్నెత్తి అయినా చూడకుండానే.

అతనంతకంటే గడుగ్గాయిలా వున్నాడు. 'పిలవక్కర్లేదు నేనతనినిడనే!' అన్నట్లు లోపలికొచ్చేశాడు.

"ఉమా! ఎవరే వచ్చారు?" వంటింట్లో నించి అమ్మమ్మ గొంతు వినిపించింది.

వాళ్లను కూర్చోమని చెప్పి,

"ఇందిరా వాళ్లాయన ప్రసాద్‌గారమ్మమ్మా !" అంటూ వెళ్లి,

"కొంచెం కాఫీ పెట్టవా అమ్మమ్మా?" గారాలు కురిసింది ఉమ. ముసలావిడ పొంగిపోయి, "అలాగే! నువ్వెళ్లి మాట్లాడుతుండు. నేను కాఫీపెట్టి తీసుకొస్తాను" అంది.

ఉమ గదిలో కెళ్లేసరికి ప్రసాద్ కూర్చున్నాడు. ఆ రెండవతను కిటికీ దగ్గరగా నిలబడి బైటకు చూస్తున్నాడు.

"ఏమండీ ప్రసాద్‌గారూ ? ఇందిర ఎక్కడా కనిపించటల్లేదు? పోయిన ఆదివారం వస్తానన్నది. తను వస్తుంది కదానని నేనెక్కడికీ వెళ్లలేదు. మీరు కాని వెళ్లొద్దన్నారేంటి?" మంచంమీద కూర్చుంటూ ఉమ అడిగింది. ప్రసాద్ తెల్లబోయాడు.

'ఏంటీ పిల్ల? ఇంకొక మనిషి వచ్చాడనీ, అతన్ని కూర్చోమని చెప్పాలనీ తెలియదా? తను కూర్చుంది గాని, అతణ్ని కూర్చోమని చెప్పనేలేదు.' అనుకొంటూ గత్యంతరంలేక తనే,

"ఉమాదేవీ! నేను పరిచయం చెయ్యలేదు కదూ! ఇతను నా కజినే. ఇక్కడ ఏదైనా ఉద్యోగ ప్రయత్నం చేద్దామని వచ్చాడు. ఎం. ఎస్. సి. ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాడు" అనిపరిచయం చేశాడు. అతను అక్కడే నిలబడి పిల్లవైపు తిరిగాడు.

"నువ్వేం చెప్పక్కర్లేదురా ప్రసాద్ ! ఆమెకు నేనింతకుముందే తెలుసు. అయితే, అప్పుడు నేనంటే చాల చెడ్డ అభిప్రాయం ఏర్పడ్డదనడానికి ఇదిగో, ఈ నిదర్శనాలు చాలు. కాని, కాకతాళీయంగా జరిగిన దానికి ఎవరూ బాధ్యులుకారు. మీరిది తెలుసుకొంటే బాగుంటుంది. ఉమాదేవి !"

'చస్ ! నాతో మాట్లాడకండి. ఇంటికి వచ్చిన వాళ్లను అవమానించటం మర్యాద కాదు గనుక, ఇంతసేపూ మీ ఉనికినైనా సహించాను. ప్రసాద్‌గారూ! కూర్చోమని చెప్పండి మీ కజిన్‌కి నేను మాత్రం అతనితో మాట్లాడను."

అంటూ లోపలికెళ్లి కాఫీలు తీసుకొచ్చింది. విషయం తెలియని ప్రసాద్ తెల్లబోయి చూశాడు తమ్ముడివైపు. అతను నవ్వుతూ చెప్తానులే అన్నట్లు సౌజ్ఞ చేశాడు. ఉమ వెనుకనే అమ్మమ్మ ఇవతలకు వచ్చింది.

"ఏం ప్రసాద్‌బాబూ ! బాగున్నావా ? మీ ఆవిడ రావటంలేదేం ?" అని ఆదరంగా పలుకరించారావిడ.

"మా ఇంటికి చుట్టాలొచ్చారు. అందుకని రాలేదు. ఇదిగో ! వీడు మా పెదనాన్న గారబ్బాయి. ఇక్కడేదైనా ఉద్యోగంకోసం వచ్చాడు." అని తమ్ముణ్ని అమ్మమ్మగార్కి పరిచయంచేశాడు. అతడు సవినయంగా "నమస్కారమండీ !" అన్నాడు.

"దీర్ఘాయుష్మాన్ భవ !" అని నోటినిండుగా ఆశీర్వదించి, "అదేమిటి నాయనా ? నిల్చొనే ఉన్నావ్ ? కూర్చో బాబూ !" అని తను కూడా గుమ్మం దగ్గరగా కూర్చున్నారావిడ.

అతను ఒక్కసారి ఉమవైపు చూసి అమ్మమ్మగారి దగ్గరగా కుర్చీలాక్కొని కూర్చున్నాడు. ఉమ ప్రసాద్‌కి కాఫీ ఇచ్చి, ఇంకొకగ్లాసు అమ్మమ్మ దగ్గరగా పెట్టి, "అతనికిచ్చెయ్యమ్మా !" అంది.

ఆవిడగ్లాసు ముందుకు పెట్టి "తీసుకో నాయనా! ఆ మీరెంతమంది అన్నదమ్ములు ? ఏవూరు నాయనా ? మన గోత్రమేమిటన్నావ్ ?" అంటూ విషయ సేకరణ ప్రారంభించింది.

అమ్మమ్మవైపు చురచురచూస్తూ, "నీకెందుకమ్మమ్మా అవన్నీ ! నువ్వేం వియ్యమందుతావా వాళ్లతో, లేకపోతే కయ్యానికి కూడా అవన్నీ కావాలా?" అంది ఉమ.

"అదేమిటే మాటకు ముందు అలా కయ్యాని కొస్తావ్ ? అన్ని కుదిరితే వియ్యమే అందుతామో, కయ్యమే ఆడతామో అవన్నీ మేం చూసుకోవలసినవి. నీకెందుకు ? నీ గొడవేమో నువ్వు చూసుకో !" అనేసిందావిడ.

ఉమవైపు విజయగర్వంతోకూడిన చూపొకటి పారేసి, బుద్ధిమంతుడిలా అమ్మమ్మగారి ప్రశ్నలకు జవాబు చెప్తున్నాడతను. కొంచెంసేపు కూర్చున్న తరువాతఅన్నదమ్ములిద్దరూవెళ్దామనిలేచారు.అతనమ్మమ్మగారికి నమస్కరించి, "వస్తామండి మామ్మగారూ !" అన్నాడు.

"మా నాయనే ! ప్రసాద్‌తో వస్తూవుండు నాయనా !" అని దీవించింది.

వాళ్లసలా వెళ్లనిచ్చి అమ్మమ్మ మీద ఖస్సుమని లేచింది ఉమ.

"ఏం ... కమ్మమ్మా ... న్ని వస్తూండమని చెప్పావ్? అతనెంత చెడ్డవాడో తెలుసా ? అతను ఒకనాడు నన్నెంత అల్లరి పెట్టాడో ! ఛి, ఛి, తలచుకొంటే ఏడుపొస్తుంది." అని కళ్లనీళ్లు పెట్టుకొంది.

అమ్మమ్మ గాభరాగా "ఏంటీ ? అతను నిన్నల్లరి పెట్టాడా ? నాకేం తెలుసే ? అయినా అతను మంచి వాడిలావున్నాడు. నువ్వేమన్నావో ? నీ కసలు అందరిమీదా ఒంటికాలిమీద లేవడమలవాటు." అంది.

"ఆ ఆ ఇప్పుడు నేనేం చెప్పినా నమ్మవు. అసలేం జరిగిందో వింటే నువ్వు అతని ముఖమైనా చూడవు తెలుసా ?"

అంటూ జరిగిందాన్ని సరిగ్గా గుర్తు తెచ్చుకొంటున్నట్లు కూర్చుంది.

"ఒకనాడు, ఆమధ్య ఆదివారం ప్రయివేటు క్లాసులు పెట్టేరు గుర్తుందా ? అప్పుడన్నమాట శ్యామల, శ్యామల తెలుసుకదూ నీకు ? అదీ, నేనూ నాలుగ్గంటలకు క్లాసయి వచ్చేస్తూ, పదమూడో నెంబరు బస్సు ఎక్కాం. అదివారమేమో ఎంత రష్‌గా వుండాలో అంతా వుంది. మాకు మెట్లమీద నిల్చుందుకు మాత్రంచోటు దొరికింది. క్రింద మెట్లమీద క్లీనరు కుర్రాడూ, మరెవరో ఒకతను నించున్నారు. పైన సరిగ్గా మాకెదురుగా నలుగురబ్బాయిలు నించొన్నారు. హాస్పిటల్ డవున్‌లో బస్సు వెళ్తుండగా కండక్టరు టిక్కెట్లంటూ వచ్చాడు. నేను వెనుక ఇనపకమ్మికి జార్లబడి పర్సుతీశాను. ఇంతలో మలుపు తిరిగింది. బస్ పట్టులేక పోవడంతో పడిపోబోతుంటే శ్యామల పట్టుకోబోయింది. దాంతో ఇద్దరంకలిసి, చేతిలో పుస్తకాలతో సహా పైమెట్టు మీద కూర్చుండిపోయాం. నిజ్జంగా నలుగురిలోనూ ఈ మహాను భావుడువున్నాడులే ! చటుక్కున....ఛీ, ఛీ తలుచుకొంటే అసహ్యమేస్తుంది. చెయ్యిపట్టుకొన్నాడు. మహా పడిపోయేవాళ్లందరిని ఆ పేసేవాడిలా అలా పట్టుకొని బలవంతంగా లేవదీశాడు. తను క్రిందికి దిగి మెట్టు మీదనుంచుని మాకిద్దరికి పైనచోటిచ్చాడు. ఇహ అక్కడినుండి, ఆ మిగిలిన ముగ్గురూ.... రఫుడీ....వెధవలు.....'అబ్బ! ఎంత మంచి సీనురా! కెమెరావుంటే ఫోటోతీయించి, హీరో,హీరోయిన్లను అందరికీ చూపెడితే ఎంత బాగుంటుందో ?'అంటూ ఒకటేగోల అప్పటినుంచి ఎక్కడకనబడినా ఆవెధవలు హీరోయిన్‌రోయ్! హీరోయేడి ? అని ఇష్టమొచ్చిన నట్లు వాగుతున్నారు. అదే కాకుండా, ఆవేళ అతను కూడా మావెనకాలే, మస్కాన్‌లోనే దిగాడు. ఇంకా చెప్పాలా ఆ వెధవల అల్లరి !"

ఉక్రోషంగా చెప్పుకుపోతున్న ఉమ అమ్మమ్మ మాటంతో వులిక్కిపడింది.

'అయితే అందులో అతని తప్పేముందో చెప్పు ? ఇంకా నయం. ఇలాపడేదటు పడితే నడుస్తున్న బస్సులోంచి క్రిందపడేవారు కాదూ ? ఏకాలో, చెయ్యో విరిగేది ఆవేళ అతను ఆపేడు కాబట్టి సరిపోయింది. అయినా, నేను చెప్తాను కాదే నీకు అందరిమీదా విరగటం ఎక్కువైయిందని" అంటూ "ఇంకా కూర వేయించుకోవాలి పిల్లొచ్చారని ఇలా వచ్చాను" లేచిందావిడ.


అమ్మమ్మ మీద కోపమంతా చేతిలోని విసనికర్రపై మాపిస్తూ, "ఛీ, ఛీ, అందమైన ఆదివారం సాయంత్రం పిల్లొచ్చి పాకు చేశారు. ఏకటి ... నా

## హృద్దీపాల్ని వెలిగించండి!

మీమీ జీవనదీపాలు కొడిగట్టిపోతున్నాయనీ
మీ ఆశల తంత్రులు తెగిపోతున్నాయనీ
సమస్యల జ్వాలాజిహ్వలు
మిమ్మల్ని కౌగలించుకోవడానికి
పీసమైనా జంకటం లేదనీ
దిగాలుపడి— చతికిలబడి
మీ చేతకానితనాన్ని
పదిమందికీ పంచకండి !
మీ చేత 'కానీ'తేనితనాన్ని
బహిరంగ పరచకండి.
చీకట్లో కూర్చుని చీకటిని తిట్టకండి.
ఈ రాజకీయపు విష ప్రభంజనాలకీ
ఈ నిజాలులేనియిజాల సర్పాల కరాళదంష్ట్రలకీ
ఈ అన్యాయాల రక్షఃపిశాచపుంజాలకీ
బెజారై —పరలోకానికి
పలాయన మంత్రం పఠించకండి !
'ఆశ మానవ జీవితానికి శ్వాస' అన్నదిగుర్తుంచుకొని
ధైర్యమనే ప్రమిదలో
నమ్మకం వత్తితో
విజిగీషతో—మనశ్శుద్ధితో
హృద్దీపాల్ని వెలిగించండి ! !
మీమీ బాధల తమిస్రాన్ని నిర్మూలించండి!

—డియస్నెస్.

డా. పి.వి.కె. రావ్, B.A., సెక్స్ స్పెషలిస్ట్



వైద్యవిద్వాన్ — వైద్యాచార్య హస్తప్రయోగం, నరముల బలహీనత, అంగము చిన్నదగుట, శీఘ్రస్ఖలనము, శుక్లనష్టము, సుఖరోగములకు, మానసిక వ్యాధులకు శాస్త్రీయ చికిత్స, విదేశీ యంత్రములతో ప్రత్యేక చికిత్స, పోస్టుద్వారా కూడా చికిత్స గలదు.

రా మ్మూ స్ క్లి నిక్

టి. బి. రోడ్, తెనాలి. ఫోన్ : 700

SUVARNA

**WHEN NATURE FAILS**

**H** New Super eight మరింతఎత్తు పొడుగు కాగలరు (2 నుండి 8 అం. వరకు పూచీ)

**For Super-Heightness**

మీరు పొడుగుగా పెరగదలచుకుంటే ప్రపంచ ప్రఖ్యాతిపొందిన మా హైటెక్స్ **HYTEX** ఔషధాన్ని వాడండి. వయోపరిమితి లేదు. స్త్రీలు, పురుషులు కూడ పుచ్చుకోవచ్చు. Hytex is a great name and meant for popular people

వెల : బుడ్డి 1 కి **(20 TABS) Rs. 3-75** పోస్టేజి అదనం. Full Crurse 3 Pluais **(60 TABS)** Rs.11-25p. Postage Free

**M/S. VICTORIA COMMERCIAL COY.,**

Flat Door No. 3883X,

Be t No.1, Ambala Cantt-133001 N I.

**ఆంగ్లేయబోధిని**

(ENGLISH - TELUGU)

పిన్నలకు, పెద్దలకు ఉపయోగకరము. అక్షరాభ్యాసము కానివారుకూడా మా ఆంగ్లేయ బోధిని సహాయంతో 60 దినములలో ఆంగ్లము నేర్చుకొనవచ్చును. బాల బాలికలకు చాల సహాయపడును. మా ఆంగ్లేయబోధినిలో ఇంగ్లీషు ఉచ్చారణ పలుకు రీతి తెలుగులో వ్రాయబడి యున్నది. దీనిలో ఇంగ్లీషుకు తెలుగులో గ్రామరు, వ్యాసములు, ఉత్తరములు వ్రాయుట సామెతలు, కథలు మున్నగు విషయములు చక్కనా సులభశైలిలో యున్నవి. సుమారు 600 పేజీలుగల పుస్తకం వెల: రు.10/-పోస్టేజీఅదనం

**బాలసరస్వతీ బుక్ డిపో,**

ఫోన్ : 29868 మద్రాసు—1.

# ఆదివారం సాయంత్రం

పడిపోయింది. ఇక డాబామీదకెళ్ళినా లాభంలేదు అనుకొంటూ పుస్తకం పట్టుకొక్కూర్చుంది ఉమ.

* * *

"అబ్బ! నెల్లాళ్ళయింది వెధవ పరీక్షలు కాను వాని ఆదివారంనాడైనా ఎటూ పోవడానికి వీల్లేకుండా అయింది. అమ్మయ్య! అయిపోయాయి. ఇవాళ ఎక్కడికైనా వెళ్తే బాగుండును. ఎవ్వరూ తోడు లేరు. బీచికైనా వెళ్ళిరావాలి." అనుకొంటూనే ముస్తాబై పోయింది ఉమ. తెల్లని ఫుల్‌వాయిల్‌మీద బోర్డరుగా పెయింట్‌చేసిన ముదురు నీలంరంగు పెద్ద పెద్ద పువ్వులున్న చీరకట్టుకొని, ముదురు నీలం జాకెట్ వేసుకొని, తయారైన ఉమనుచూసి,

"ఎక్కడికే ఒక్కతెవీ బయలుదేరావు? ఆదివారం ఎవరైనా వస్తారేమో ఇంటిదగ్గరుండ కూడదూ? అయినా నేచెప్తే వింటావా నువ్వు?"

అంటూ బియ్యం చేటపట్టుకొని లేచింది అమ్మమ్మ. వినగా ఆవిడవైపు తిరిగి "అదిగాపూ? పెద్దదానివైనా నీకేబుద్ధిపోదేం? ఎక్కడికి బయలుదేరినా అడుగుతావు! ఇక ఇంటికెవరైనా వస్తారంటావా, వస్తే నువ్వు మాట్లాడు లేకపోతే పొమ్మను." అంటూ జోళ్ళు తొడుక్కొని వెళ్ళిపోయింది ఉమ. ముందు శ్యామలా వాళ్ళింటికి వెళ్ళి, ఇద్దరూ కలిసికాసేపు బీచ్‌లో కూర్చుని రావాలి అనుకొని అఫీషియల్ కాలనీలోని శ్యామల ఇంటికి బయలుదేరింది.

* * *

ఎగిరిపడే అలలను చూస్తూ ఒంటరిగా కూర్చుంది ఉమ. కాస్సేపు చూసేసరికి అదికూడా విసుగేసింది. చుట్టూ తనలాగే చల్లదనానికి వచ్చికూర్చున్న వాళ్ళను కలియచూసింది. 'అందరకూ ఎవరోఒకరు తోడున్నారు. తనకే ఎవరూ కంపెనీలేరు. ఛ, శ్యామల కూడా ఇవాలే సినిమాకు వెళ్ళిపోవాలా? పోనీ తనకు కూడా చెప్తే తనుకూడా వెళ్ళేదిగా!' అనుకొని అయినా అది వాళ్ళబావతో వెళ్ళిందిట. పిలిస్తే మాత్రం తనెలా వెళ్తుంది వాళ్ళతో! అనుకొంటూ మరోసారి చుట్టూ చూసింది. అందరూ ఎవరిధ్యాసలో వాళ్ళున్నారు. కొస్తదూరంలో ఎవరో ఒకతను తనలాగే ఒక్కడూ కూర్చొని ఏదో పుస్తకం చదువుకొంటున్నాడు. అతనికీ పుస్తకమైనా వుందితోడు తనకదీలేదు. అరే! అతను.... అతనేలా వున్నాడే!, అనుకొంటూనే అటువైపు పరీక్షగా చూసింది ఉమ. ముదురు నీలం రంగుపాంటుమీద, తెల్లగా పాలనురుగులాంటిస్లాక్ వేసుకొని వాచేతిమీద ఆని, ఇసకలో పడుకొని, పుస్తకం చదవటంలో లీనమైపోయాడతను. తనకు తెలియకుండానే తనకేసిచూస్తే బాగుండుననుకొంది ఉమ. మరుక్షణంలో ఛీ, ఛీ ఇదేమిటి నేనిలా ఆలోచిస్తున్నాను అతను చేసిన పరాభవమప్పుడే మరిచిపోయా?" నిజం చెప్ప. పరాభవమా అది? ఆదేక్షణంలో నీలో ఏవో కొత్త శక్తులు నిద్రలేచినట్లనిపించలేదూ? అవి నీకు ఇష్టంగా కూడా వున్నాయికదూ?' అంటూ ఎవరో నిలదీసినట్లనిపించింది.

'నిజమే! రెండవసారి అతనుకలిసి అంతా కాక తాళీయమని చెప్పినప్పటినుంచీ, తనలో ఏదో తనకే తెలియని మార్పువచ్చింది. వద్దన్నా, ఆనాటి అతని స్పర్శ, మాటలు తనను చుట్టుకొంటున్నాయి' ఇలా అనుకోగానే ఉమ అతన్ని పలకరించుదామనే ఆలోచనను ఆపలేకపోయింది.

లేచి, చీరకుచ్చిళ్ళు సర్దుకొని, అటువైపుగా నాలు గడుగులువేసి ఆగిపోయింది 'ఒకవేళ అతనుదీన్ని అలుసుగా తీసుకుంటే' అనిపించగానే అతనంతట అతను పలకరించేలా చేయాలనే పట్టుదల హెచ్చింది. అటువైపుగా నడుస్తున్నదల్లా ఆగి, నీటివైపుగా నడిచి, ఒడ్డునే కొంతదూరం నడిచింది. కనుచీకటి పడుతోంది. ఇక ఇంటికెళ్ళాలని వెనక్కు తిరిగింది. అతను కూడా పుస్తకం మూసేసి, చుట్టూచూస్తూ కూర్చున్నాడు. దూరంనుంచే అది చూసిన ఉమ తనతనిని చూడనట్లుగా నీళ్ళకేసి చూస్తూ నడిచింది. అతన్నిదాటి వెళ్ళిపోయాక,

"అరే! ఉమాదేవి!" అంటూ అప్రయత్నంగా పిలిచాడతను. అందుకోసమే చూస్తున్నట్లుగా చటుక్కున వెనక్కు తిరిగింది. చొందగ్గరగా వచ్చేశాడతను.

"ఒక్కరేవచ్చారా?" తమ మధ్య ఏం జరగనట్లు ఒక స్నేహితుడిలా పలకరిస్తున్న అతనిని చూసి ఆశ్చర్యపోయింది, ఉమ. తనతనికిచేసిన అవమానం మరచిపోయాడా? లేకపోతే . . . లేకపోతే అతను కూడా తనలాగే ఫీలవుతున్నాడా?' ఇలా అనుకోగానే ఉమ చెక్కిళ్ళు ఎర్రబడ్డాయి.

"ఏమిటండీ అలా చూస్తున్నారు? ఏం నా మీద కోపం పోలేదా?" అన్నాడతను తనను తాను చూసుకుంటూ.

"అబ్బె! అది కాదండీ, హటాత్తుగా మీరు కనబడేసరికి. . ." పూర్తి చెయ్యలేక పోయింది.

"ఏం కయ్యమాడాలో కబుర్లాడాలో అర్థం కావటం లేదాండీ?" చిలిపిగా నవ్వుతూ అన్నాడు. "మీ యిష్టం మీరు కయ్యమాడినా, నాలుగు కబుర్లు చెప్పినా, ఏమైనా సరే! మీతో గడపాలని అంతే! తిడతారా! రెడీ!" అన్నాడు కొంచెంతలవంచి తమాషాగా. అతన్ని అలా అతి దగ్గరగా చూస్తుంటే ఉమకు తన కలలకు ప్రతిరూపంలా తోచాడు. వెంటనే ఆ వేళ అమ్మమ్మ అన్న 'వియ్యమే అందుతావో కయ్యమే ఆడతావో అది మా యిష్టం' మాటలు కూడా జ్ఞాపకం వచ్చాయి. దాంతో ఉమ మనసు పూర్తిగా అతని వశమై పోయింది.

ఉమ మాట్లాడక పోవడంతో ఆమెకు తన మీదింకా కోపం పోలేదనుకొని, నిరుత్సాహపడి పోయాడు తను. "సారీ! మీకిష్టం లేకుండా నేను మిమ్మల్ని నిలవేశానులా వుంది. వస్తానండీ." అని వెనుతిరిగి పోయాడు.

అతన్ని ఎలా ఆపాలో తన వుద్దేశ్యాన్నెలా చెప్పాలో అర్థం కాని ఉమ "మీరు. . ." అని మాత్రం అనగలిగింది.

అంతమాత్రానికే పొంగిపోతూ ఉమకు అతి దగ్గరగా వస్తూ "మీకు . . . మీకు నా మీద కోపం లేదా? ముందిది చెప్పండి" అన్నాడు.

"ఛ, కోపమెప్పుడో పోయింది. దాని స్థానాన్ని."

తరువాత నీవే పూర్తి చేసుకో అన్నట్లు వదిలేసింది.

"పూ దాని స్థానాన్ని. ... ఏం నిలిచింది? చెప్పరూ?" అని అతనడుగుతుంటే చెప్పలేక, చెప్పడ మసలు చేతగాక,

"ఇంటిదాకా దిగబెట్టరూ నన్ను? చీకటి పడి పోయింది." అని మాట మార్చేసింది ఉమ.

అప్పుడే ఈ లోకంలోకి వచ్చినట్లు చుట్టూ చూసి.

"మై గాడ్! అంతా వెళ్లిపోయారే! పదండి పదండి, మామ్మగారేం ఖంగారు పడుతున్నారో?" అంటూ ముందుకు నడిచాడు.

"మీకు జాబ్ ఏమైనా దొరికిందా?" దారిలో అడిగింది ఉమ.

"అః మా ఇందిర మీతో చెప్పలేదా? అయినా నా మీద కోపంతో వున్నారు, చెప్పినా వినేటట్లు లేరనిపించి మానేసిందేమో? మీ కాలేజీలోనే టెంపరరీయే అనుకోండి, కాని,ఈ శలవల తరువాత పర్మనెంట్ చేస్తామనీ, లెక్చరర్ పోస్టు యిస్తామనీ చెప్పారు. నాకేమో ఈ లెక్చరర్‌గిరీ నచ్చదు. అందుకని కొన్ని కంపెనీలకి అప్లై చేశాను. ఏదైనాఇంకొకటి మంచిది వస్తే ఇది వదిలేస్తాను." అలా మాట్లా డుతూ హాస్పిటల్ ఒ. పి. గేట్ దాకా వచ్చారు. అక్కడ బత్తాయిలు, ద్రాక్ష పండ్లున్న బండి చూసి

"వెయిట్ ప్లీజ్, ఒక్క నిముషంలో వస్తాను. అలా ప్రక్కకు నిల్చోండి" అని గబగబా రోడ్ క్రాస్ చేసి వెళ్లి నాలుగు బత్తాయిలు, కొంచెం ద్రాక్ష పండ్లు తీసికొని వచ్చాడు.

"అదేంటండి మీయింట్లో ఎవరికైనా వంట్లో బాగుండటం లేదా?" అనడిగింది ఉమ అవన్నీచూసి. అతను చిన్నగా నవ్వి,

"మా యింటికి కాదండి. మామ్మగారికి. ఏమిటో ఆవిడను చూస్తే మా బామ్మ జ్ఞాపకం వచ్చింది. క్రితం సారి ." అన్నాడు.

"ఇప్పుడివన్నీ ఎందుకండి?" మొహమాటపడింది ఉమ.

"ఎందుకేమిటండి? పెద్దవాళ్ల దగ్గరికీ, పసి పిల్లలున్న చోటికి వట్టి చేతులతో వెళ్లకూడదనేది మా అమ్మ. సరేలెండి! ఇంతకీ మీరు పరీక్షలెలా వ్రాశారు.? పాస్ అవుతారా? మా ఇందిర మీకు క్లాస్ వచ్చేస్తుందని చెప్పింది" అనేసరికి ఉమ ముఖ మంతా ఎర్రగా చేసికొని,

"అంతా వట్టిది! నాకైతే హిస్టరీ పేపరుపాడు చేశాననిపిస్తోంది. తను అన్నీ బాగా రాశానంది. తనకే వస్తుందేమో క్లాస్" అన్నది.

అతను ఫక్కున నవ్వి, "నేనొకమాట చెప్పనాండి? పరీక్షలు రాసిన ఏ యిద్దరు స్నేహితుల నడిగినా ఇదేమాట చెప్తారు. అఖరికి ఇద్దరికీ వస్తుందేమో క్లాస్ ఎవరు చెప్పగలరు?" అన్నాడు.

"మీరు భలే తమాషాగా మాట్లాడుతారండి." అంటూ ఇంటి మెట్లెక్కింది ఉమ.

జోళ్లు విడిచేసి లోపలి కెళ్లేసరికి ముందున్న గదిలో మంచం మీద పడుకోనుంది అమ్మమ్మ. ఆత్రుతగా దగ్గరకెళ్తూ,

"ఏం అమ్మమ్మా పడుకోనున్నావ్? చూడ ఆ వేళ వచ్చారే ప్రసాద్‌గారి తమ్ముడు. ఆయన వచ్చారు. నిన్ను చూడ్డానికి." పలకరించింది ఉమ.

అమ్మమ్మ మగతగా మూల్గి "ఏం లేదే! కొంచెం కళ్లు చీకట్లు కమ్ముతుంటే వచ్చి పడుకొన్నాను. అదేమిటో ఒంటి మీద తెలివి లేక పోయింది."

అంటూ లేచి కూర్చోబోయిందావిడ. కాని, తల నొప్పితో బద్దలై పోతుండడంతో లేవలేక పోయింది.

"మీరు పడుకోండి మామ్మగారూ!" అని ఉమ వైపుకు తిరిగి "కొంచెం పంచదార నీళ్లు కలిపి పట్టుకొని రండి. అవి తాగితే సర్దుకొంటుంది. కొంచెం బి. పి. లైపై వుంటుంది." అన్నాడు.

అమ్మమ్మకు బి. పి. వున్నట్లు ఇతనికెలా తెలుసా అనుకొంటూ వంటింట్లోకి నడిచింది ఉమ. పంచ దార నీళ్లు తయారు చేస్తూనే 'ఇందుకే కాబోలు సాయంత్రం తననెళ్లవద్దన్నది. తనకప్పుడే ఏమో త్రమో అనుమానం వుండి వుంటుంది. తానేమో చికాకు పడ్డది. అమ్మమ్మ మీద' అని పశ్చాత్తాప పడసాగింది.

"ఇంతసేపా పంచదార నీళ్లు తేవటం? గ్లాసు చేత్తో పట్టుకుని ఆలోచనల్లో తేలిపోతున్నారా? అది ఇలా ఇవ్వండి. నేనైనా యిస్తాను మామ్మగారికి." అన్న అతని మాటలతో త్రుళ్లిపడి లేవబోయి ముందున్న పీట తన్నుకొని పడబోయింది. చటుక్కున ముందుకు వచ్చి ఒక చేత్తో ఆమె చేతిలోని గ్లాసును రెండవచేత్తో ఆమె చేతిని పట్టుకొని ఆపాడతను. ఆ క్షణం చాలు ఉమలో నిద్రాణమై వున్న స్మృతులు మేల్కొనడానికి. తలెత్తి అతని ముఖంలోకి చూడ లేక పోయింది. అతను కూడా అదే అనుభూతి పొందు తున్నవాడిలా చూసి, వెంటనే చెయ్యి వదిలేశాడు.

"సారీ! మళ్లీ మీకు కోపం తెప్పించే పనే చేశాను కాని, ఇది కూడా కాకతాళీయమే." అనేసి గ్లాసు పట్టుకుని మామ్మగారి దగ్గరకెళ్లి పోయాడు. ఉమ మాత్రం ఇంకా తన శరీరానికి తగిలిన విద్యుత్ప్రసారం నుండి తేరుకోలేక పీట మీద కూర్చుండి పోయింది. అలా ఎంత సేపు కూర్చుందో ఆమెకే తెలియదు.

"ఉమాదేవి!" పిల్చాడతను.

గబుక్కున ఇవతలి కొచ్చింది. కాని, సూటిగా అతనివైపు చూడలేక పోయింది. బయటకొచ్చిన ఉమ ముఖంలోని మార్పుని బట్టి అర్థం చేసుకో గలిగిన అతను మనోహరంగా నవ్వుతూ "మరికవెళ్లి రానా?" అన్నాడు.

"ఊఁ" అని అతి ప్రయత్నం మీద "మళ్లీ ఎప్పుడొస్తారు?" అనడిగింది.

"ఎప్పుడు రమ్మంటారు?" అతనంతకన్నా గడుసుగా చూశాడు.

ఉమకు అర్థమై పోయింది. తనలోని మార్పు అతనికి తెలిసి పోయిందని. ఇక తలెత్తి అతనివైపు చూడలేక పోయింది. అతను వెళ్లి పోతుంటే వెనకే వెళ్లింది వీధి గుమ్మం వరకు. ఉమకప్పుడు గాని గుర్తు రాలేదు. తనకతని పేరైనా తెలియదని.


"ఇన్ని కబుర్లు చెప్తున్నారు. మీ పేరేమిటో నాకు తెలియదింతవరకు." అన్నది అతని వైపు చూడకుండానే.

"అబ్బ! ఇప్పుడా జ్ఞాపకం వచ్చింది? ఎప్పుడడుగు తారా అని ఎదురు చూస్తున్నా. సరే! నా పేరేమిటో తెలుకోవాలని వుందాండి? గోపాలకృష్ణ. అమ్మ గోపి అని పిలుస్తుంది. స్నేహితులు గోపాల్ అని పిలు స్తారు. ఇక కృష్ణా అని పిలిచే వారింతవరకు తటస్థ పడలేదు. ఇప్పుడనిపిస్తోంది. ఒకరలా పిలిస్తే బాగుండునని, కాని, వాళ్ల కిష్టమవాలిగా మరి?" చిలిపిగా అనేసి గుమ్మం దిగి పోయాడతను.

మర్నాడు తెల్లవారేసరికి అమ్మమ్మకు తేలికగా వుండటంతో కుదుట పడింది ఉమ మనసు. ఆ రోజు మధ్యాహ్నం అయిన దగ్గర్నుంచి ఎదురుచూసింది గోపాల్‌కోసం. ఆ రోజు... మరురోజు. . . అలా ఉమ ఎదురు చూస్తుండగానే మళ్లీ ఆదివారం వచ్చేసింది. ఈ వారం రోజులూ ఉమ అతని కోసం ఎదురు చూసి, చూసి విసిగి పోయింది.

"ఇవాళ ఆదివారం. అతను వస్తాడు బహుశా. అప్పటికి తనింట్లో వుండకూడదు. అదే తగినశాస్తి. అనుకొని మూడు గంటలకే తయారై, అమ్మమ్మతో చెప్పి శ్యామలా వాళ్లింటికి వెళ్లింది ఉమ. శ్యామలా వాళ్లింట్లో అడుగు పెడుతూనే ప్రక్కగదిలోంచి మగవాళ్ల గొంతుకలు వినబడేసరికి అయ్యో! వాళ్ల బావ వున్నారేమో, ఇప్పుడొచ్చాను నేను" అనుకొం టూనే లోపలికెళ్లింది.

శ్యామలా వాళ్లమ్మగారు అరటికాయలు తరు గుతూ వంటింటి గుమ్మంలో కూర్చునున్నారు. వెళ్లి



# ఆదివారం సాయంత్రం

అవిడ దగ్గరగా కూర్చొని "శ్యామల లేదాండి?" అనడిగింది ఉమ.

అవిడ "ఉన్నదమ్మా! వాళ్ల బావ వచ్చాడు. అతని ఫ్రెండ్ ఇంకెవరో వచ్చారు. వాళ్లతో మాట్లాడుతోంది. పిలుస్తానుండు." అని "శ్యామా!" పిలిచారావిడ.

"ఏమ్మా! బజ్జీలయి పోయాయా?" అంటూవచ్చింది శ్యామల. ఉమను చూసి "అర్రే" అంటూ వచ్చి గట్టిగా వట్టేసుకొంది.

"అబ్బ! ఎన్నాళ్లయిందే ఉమా నిన్ను చూసి. ఈ మధ్య రావటం మానేశావు." అంది నిష్ఠూరంగా.

"ఏయ్ శ్యామలా! తిన్నగా మాట్లాడు. క్రిందటి ఆదివారం వస్తే, మీ బావతో సినిమాకు చెక్కేశావ్ ఒక్కతెనీ ఏం తోచక చచ్చాను.' అంది ఉమ విడిపించుకొంటూ.

"పోన్లే, పోన్లే, తిట్టకు. నాదే తప్పు. సరేనా! మా బావను చూడ్లేదుగా? చూద్దూగాని రా! అమ్మా అవయి పోగానే పిలువే. వచ్చి తీసికెళ్తాను." అని ఉమ చెయ్యి పట్టుకొని లాగింది.

'అబ్బ! వద్దే శ్యామూ! అతని ఫ్రెండ్ ఇంకెవరో వచ్చినట్లున్నారు. ఇంకోసారెప్పుడైనా చూస్తాగా! ఇవాళ్టికి వదిలెయ్యి" బతిమాలుకొంది ఉమ. కాని శ్యామల వూరుకోలేదు.

"అబ్బ! అంత పొగరూ ఏమయి పోయిందే ?! వాళ్లతో సమంగా వాళ్లను మనం కూడా ఏడిపిస్తే గాని, ఈ మగవాళ్ల ఆటలుకట్టవు అనేదానివి. ఇపుడు ఆ మగవాళ్లముందుకురావటానికేజడుస్తున్నావేం?" అంది

"వెళ్లమ్మా! తెలవయిపోయిందతనికి. రాత్రికి వెళ్లిపోతాడు. మళ్లీ పెళ్లికే వస్తాడు. నీ స్నేహితురాలి భర్తను నువ్వు చూడవా ఏమిటి? శ్యామలా వాళ్లమ్మగారు నవ్వుతూ అన్నారు. దాంతో కదలక తప్పలేదు ఉమకు.

శ్యామల వెనకే వాళ్లన్న గదిలోకి నడిచిన ఉమ, ఎదురుగాకుర్చీల్లో కూర్చునిసిగరెట్లుకాలుస్తూ కబుర్లు చెప్పుకొంటున్న వాళ్లను చూసి తెల్లబోయింది. శ్యామల ఇదేం తెలియక,

"ఇదిగో ఉమా! తను మా బావ. ఎం. ఎస్. సి. పాసయ్యారు. ప్రస్తుతం కలకత్తాలో ఒక కంపెనీలో పనిచేస్తున్నారు. ఇక ఈయన..." అంటూ ఉమకేసి తిరిగింది.

అతను నవ్వుతూ "ఆగండి శ్యామలాదేవీ! మీ ఫ్రెండ్ ఉమాదేవికి నాపేరు నేనే చెప్పుకొంటాను" అనేసరికి, వారంరోజులుగా అతనికోసం ఎదురు చూస్తూ, మనసులో నలిగ్గొడుతున్న పేరును, అప్రయత్నంగా పెదాలు బయటకుచ్చరించాయి.

"కృష్ణా!" ఉమనోటినుండి ఆ పేరును విన్న గోపాల్ ప్రఫుల్లవదనంతో,

"నాకు తెలును ఉమా! నువ్వు అలా పిలుస్తావని" అనేసి తెల్లబోయిచూస్తున్న బావామరదళ్ల వైపు తిరిగి,

"చూడండి! మేం కూడా మీ త్రోవలోకి వచ్చేశాం. సో, ఇప్పుడీ రెండు జంటలు కలిసి అలా ... అలా....." అతను అభినయం చేస్తోంటే, శ్యామల హటాత్తుగా ఉమను చేతులలో చుట్టేసింది.

"అమ్మదొంగా! ఇంతకథ నడిపావా? నేనో వెర్రిదాన్ని. అన్నీ చెప్తోంటే వినేసి, నీ మనస్సులోని రహస్యాలురహస్యాలుగానే వుంచుకొన్నావా?" అంది.

ఉమ సిగ్గుతో చితికిపోతూ "అబ్బ! వుండవే రహస్యంలేదు పాడూలేదు. అసలు ముందీ పెద్దమనిషి వారంనాడు మాయమై, ఈనాడు కనిపించారు. కారణం తెలుసుకోనీ." అని అతనివైపు చూసింది.

"అబ్బే! అలాంటి సంశయాలేం పెట్టుకోకండి. మీరు మామీద ఆగ్రహిస్తే నిలువగల వోపికలేదు మేడమ్! ఏదో మరి మీలాంటి వాళ్లని జీవితంలోకి ఆహ్వానిస్తూ, ఆబోడి లెక్చరర్ గిరీతో సుఖపెట్టలేమేమో అని అనుమానమొచ్చి, అలా కలకత్తాదాకా వెళ్లి, ఏదో తిండికీ, బట్టకూ ... తమరి మేకప్ సామాన్లకూ.......' అంటూ ఆడపిల్లలవైపు చూసేసరికి వాళ్ళు గుడ్లురుముతూండడంతో, భయపడ్డట్టు "అబ్బే! మీక్కాదండి, మాకు మేకప్ సామాన్లకూ, బిల్సులకూ సరిపడ జీతం వచ్చే ఉద్యోగం సంపాదించుకొచ్చాం." అని వాచీచూసి "అచ్చా! ఐదుగంటలైంది. ఇక అనుగ్రహిస్తే అలారామకృష్ణామిషన్‌బీచ్‌దాకావెళ్లొద్దాం." అనేసరికి

"అమ్మమ్మతో చెప్పలేదు ఇంగారుపడుతుంది ఆలశ్యమైతే" అంది ఉమ "వెళ్లేటపుడు నేనొచ్చి అన్ని విషయాలూ మాట్లాడతాగా" అన్నాడు కృష్ణ. ఇంతవరకు శ్రోతగా వుండిపోయిన సుధాకర్ తేరుకొని "ఓరి! నీమనసులోని రాధ యీవిడట్రా?" అన్నాడు.

"అవునురా! అలా అనే సంతృప్తి పడదామనుకొంటున్నా. ఇక ఎదురు చూసే వోపికలేదు మరి" కొంటెగా ఉమవైపుచూస్తూ అన్నాడు కృష్ణ.

"మీరేం సర్దుకొని ఎవర్నీ ఉద్ధరించనక్కర్లేదు. శ్యామా! నే వెళ్తున్నా! అమ్మమ్మ ఎదురు చూస్తుంటుంది" అని వెనక్కు తిరిగింది.

"మేడమ్! మేడమ్! తమాషా కన్నానండి. అందమైన ఆదివారం సాయంత్రాన్ని మీ అలుకలతో పాడు చెయ్యకండి" అన్నాడు కృష్ణ.

అప్పటి అతని ముఖాన్ని తృప్తిగా చూసి ఫక్కున నవ్వింది ఉమ.

---

# మమతల వంతెన

(37వ పేజీ తరువాయి)

అన్నాడు ఆనంద్ వస్తూ. శారద చేసిన ఫోనందుకుని వచ్చాడతను.

"వారు...వారు. కనబడలేదు"

"అదుగో. అదేమిటి? అటువైపు" తక్కున అటుతిరిగింది.

మంచుని తదేకంగా సముద్రంలోకి చూస్తున్న రాధాకృష్ణను చూసింది శారద. ఆమె గుండెదడ తగ్గింది. ఇద్దరూ అటువైపు నడిచారు.

గబుక్కున వారికో దృశ్యం కనబడింది. రాధాకృష్ణ అలా కెరటాల్లోకి నడిచిపోవడం కనిపించింది.

"అయ్యో...అయ్యో" అంది శారద.

ఒక్క అదటున వెళ్లి రాధాకృష్ణ జబ్బ పుచ్చుకున్నాడుఆనంద్. తిరిగిచూశాడుఅతను.

"ఏమిట్రా? అలా వెళ్లిపోతున్నా వెక్కడికి?"

"ఆ...ఏం లేదు? నువ్వెప్పుడొచ్చావు. శారదా! నువ్వూ వచ్చావా?"

తెప్పరిల్లింది శారద. వణుకుతున్న శరీరాన్ని అదుపులో తెచ్చుకుని

"పదండి ఇంటికి వెడదాం. బాబులిద్దరూ మీ కోసం చూస్తున్నారు" అని అంది.

'టెలి కమ్యూనికేషన్ చదువుతాను నాన్నా, అంటున్న పెద్దవాడు 'పెద్దయ్యాక నేనూ అంతే' అంటున్న చిన్న కొడుకు రాధాకృష్ణ మనసులో మెదిలారు.

అతన్ని ఆవహించిన వైరాగ్యపు తెర దిగింది. అంత దాకా అతన్ని ముంచిన ప్రశ్నలు గుర్తులేవు. ఆ తెర వదిలింది.

మళ్లీ అంతా మామూలే. ఆశలు, ఆకర్షణలు. సంసారం, బంధాలు...అనుబంధాలు, ఆశయాలు, రాగద్వేషాలు. కోరికలు...ఏన్నో.

"పదండి" అన్నాడు చిరు నవ్వుతో.

శారద చేతిలో చెయ్యివేసి నడుస్తున్నాడు రాధాకృష్ణ. అతని భుజంమీద అత్యంత ప్రియమిత్రుని చెయ్యి. అతని కష్టాల్లోనూ, సుఖాల్లోనూ భాగం పంచుకునే ఇద్దరి ఆత్మీయుల మధ్య తను.

"ఇంక నాకేం కావాలి? ఏమీవద్దు ఈ జీవితం గొప్ప వరం. ఈ జీవితాన్ని ప్రేమించాలి. నేను ప్రేమించడం నేర్చుకోవాలి. నా కోసమే కాదు. ఇతరుల కోసం కూడా. ఇంక ఈ ఇద్దరికీ నా మూలంగా కష్టం కలిగించను. నాకేం తక్కువ. ఇంత ప్రేమగా ప్రేమించే వ్యక్తులుండగా" అనుకున్నాడతను నడుస్తూ, నడుస్తూ.

[సమాప్తం]

**అంకితం**

శ్రీ వెంకటేశ్వరుని పాద పద్మములకు భక్తితో. నా ఈ మూడవ నవల అంకితం

- రచయిత్రి